ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు



హార్సిలీహిల్స్‌పై నిఘా పెంచండి : కలెక్టర్



హార్సిలీహిల్స్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ గిరీషా

బి.కొత్తకోట, జనవరి 5: ఆంధ్రా ఊటీగా పిలువబడే హార్సిలీహిల్స్‌లో పటిష్టమైన నిఘా, పరిసరాల శుభ్రతను పాటించాలని కలెక్టర్ పీఎస్ గిరీషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. కొత్తగా అభివృద్ధి పరిచిన టౌన్‌షిప్ కమిటీ కార్యాలయాన్ని, గాలికోతకు గురైన రాయి వద్ద విద్యుత్ దీపాలను ప్రారంభించారు. అనంతరం హిల్స్ మీదకు వెళ్లే ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేసిన శ్రీవారి పాదాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం అధికారులతో మాట్లాడుతూ హిల్స్‌కు వచ్చే ప్రవేశ ద్వారం వద్ద సర్కిల్ ఆకర్షనీయంగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మదనపల్లె ఆర్డీవో మురళి, ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, తహసీల్దార్ రఫిక్ అహ్మద్, టూరిజం మేనేజర్ సాల్విన్‌రెడ్డి, వీఆర్వో నరేంద్రబాబు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో నంబర్‌వన్ : కలెక్టర్

మదనపల్లె, జనవరి 5: దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని కలెక్టర్ పీఎస్ గిరీషా కొనియాడారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పెంచిన పింఛన్ అమలు, కొత్త పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా జనవరి ఒకటి నుంచి రూ.3 వేలకు పెంచిన పింఛన్, నూతన పింఛన్లను అందజేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా మదనపల్లె మున్సిపాలిటీ, మండలంలో 25వేల మందికి పైగా లబ్ధి చేకూరినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ పాదయాత్రలో సీఎం జగన్ ఇచ్చిన హామీని వందశాతం అమలు చేశారన్నారు. అనంతరం పట్టణ పరిధిలోని 11,304 మంది లబ్ధిదారులకు రూ.3.42 కోట్లు, గ్రామీణ మండలంలోని 14,166 మందికి రూ.4.12 కోట్లు మెగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్‌పర్సన్ జి.షమీంఅస్లాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, బి.ఎ. నూర్‌ఆజాం, ఆర్డీవో ఎం.ఎస్.మురళి, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, తహసీల్దార్ ఎస్.మహబూబ్‌చాంద్, వైసీపీ నాయకులు రఫీక్‌అహ్మద్, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులరెడ్డి, ఆనంద్ పార్థసారధి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే నవాజ్‌బాషాలు

ABN ఆంధ్రజ్యోతి

కడప రాయచోటి.. రాజంపేటల్లో

రేపే ముగ్గుల పోటీలు



కడప, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సంక్రాంతిని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఏటా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను ఈసారి ఆదివారం కడప, రాయచోటి, రాజంపేటలలో నిర్వహిస్తోంది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులపోటీలు..రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన, ఎయిమ్ ఇనిస్టిట్యూట్స్ సౌజన్యంతో మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. కడప నగరంలో ఐటీఐ దగ్గర వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో, రాయచోటిలో కొత్తపేట రోడ్డులోని రాజు ఇంగ్లీష్ మీడియం స్కూల్ (ఒలంపియాడ్ బ్రాంచ్)లో, రాజంపేటలో శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున వరుసగా మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికయ్యే ఇద్దరు.. మొత్తం 15 మందికి విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. కడపలో జరిగే పోటీలకు వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రాయచోటిలో జరిగే పోటీలకు రాజు ఇంగ్లీష్ మీడియం స్కూల్, రాజంపేటలో జరిగే పోటీలకు శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లాలో 15,802 మందికి రూ.615.93 కోట్ల లబ్ధి
- కలెక్టర్ పీఎస్ గిరీషా

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 5: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పీఎస్ గిరీషా అన్నారు. శుక్రవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నవరత్నాలు- ద్వైవార్షిక నగదు మంజూరు కింద అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి లబ్ధి అందించడంలో భాగంగా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పీఎస్ గిరీషా, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, జీఎస్‌డబ్ల్యు ఎస్‌ఏవో మనోహర్‌రాజు, డ్వామా పీడీ మద్దిలేటి, వివిధ సంక్షేమశాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన లబ్ధిదారులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలన్నారు. నవరత్నాలు- ద్వైవార్షిక నగదు మంజూరు కింద అర్హులైన వారందరికీ నగదు జమ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో 15,802 మంది లబ్ధిదారులకు రూ.615.93 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తూ జిల్లాలో వైఎస్ఆర్ నేతన్న నేస్తం ద్వారా 26 మంది లబ్ధిదారులకు రూ.6.24 లక్షలు, వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం ద్వారా 190 మందికి రూ.28.50 లక్షలు, జగనన్న చేదోడు ద్వారా 470 మందికి రూ.47 లక్షలు, జగనన్న అమ్మఒడి ద్వారా 2480 మందికి రూ.352.99 లక్షలు, వైఎస్ఆర్ వాహనమిత్ర ద్వారా 155 మందికి రూ.22.30 లక్షలు, వైఎస్ఆర్ కళ్యాణమస్తు ద్వారా 62 మందికి రూ.53.90 లక్షలు, వైఎస్ఆర్ కాపు నేస్తం ద్వారా 58 మందికి రూ.8.70 లక్షలు లబ్ధి చేకూరడం జరిగిందన్నారు. ఇందులో రైస్‌కార్డు 479 మందికి, ఆరోగ్యశ్రీ కార్డులు 2149 మందికి, హౌస్‌సైట్ పట్టాలు 2923 మందికి, పింఛన్‌కార్డులు 3210 మందికి ఇచ్చామని తెలిపారు.

సురక్ష కేంద్రాలపై అవగాహన కల్పించాలి

- ఆరోగ్యశ్రీ రాష్ట్ర సీఈవో బాలాజీ

కలికిరి, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై ప్రజల్లో అవగాహన కలిగించాలని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శిబిరాలు విజయవంతమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశ్రీ రాష్ట్ర సీఈవో డీకే బాలాజీ ఆదేశించారు. శుక్రవారం మొదటి రోజు మండలంలోని కలికిరి సచివాలయం-1 పరిధిలో జరిగిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. శిబిరానికి అనుకున్న స్థాయిలో ప్రజలు రాకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు సరైన విధంగా అవగాహన కల్పించడంలో వైద్య అధికారుల అలసత్వం కనిపిస్తోందని, తరువాత నిర్వహించబోయే శిబిరాల్లోనైనా ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటర్ల ఏర్పాట్లు, రోగుల నమోదు ప్రక్రియ, కేస్ షీట్ల డౌన్‌లోడ్, స్పెషలిస్ట్ వైద్యుల హాజరు, మొదటి విడతలో గుర్తించిన రెఫరల్ కేసుల జాబితా తదితర అంశాల గురించి ఆయన క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి వివరాలు రాబట్టారు. ప్రొటోకాల్ ప్రకారం అన్ని రకాల మందులను నిల్వ చేయాలని సూచించారు. మొదటి విడత సురక్ష కేసుల ప్రొటోకాల్ అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా అవసరమైన వైద్య పరీక్షలు చేయడంలో నిర్లక్ష్యం పనికిరాదని, రెఫరల్ కేసుల విషయంలో చికిత్స తరువాత పాటించాల్సిన విధానాల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వుండరాదని హెచ్చరించారు. కాగా మొదటిసారిగా సీఈవో జిల్లా పర్యటనను పురస్కరించుకుని డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య శాలువాతో సత్కరించి వాగ్గేయకారుడు అన్నమయ్య చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూర్జహాన్, జడ్పీటీసీ పద్మజ, డీఎంహెచ్‌వో కొండయ్య, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ లోకవర్ధన్, ఎంపీడీవో గంగయ్య, వైద్యాధికారులు డాక్టర్ చిన్నరెడ్డెప్ప, డాక్టర్ పవన్, డాక్టర్ సోమశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ రఫీ, సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్చరించినా.. సమ్మెలోనే..!

- వినూత్న పద్ధతుల్లో నిరసనలు
- మదనపల్లెలో నల్లబెలూన్లతో.. రాయచోటిలో గుంజీలు తీస్తూ అంగన్వాడీల నిరసనలు

విధుల్లోకి చేరకుంటే.. శాఖాపరమైన చర్యలు తప్పవు. వెంటనే విధుల్లోకి చేరాలని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసినా ఏమాత్రం లెక్కచేయలేదు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం ఆపేది లేదు.. ఎంత వరకైనా వెళ్తాం అంటూ అంగన్‌వాడీలు మొండికేశారు. గత 25 రోజులుగా వినూత్న పద్ధతుల్లో నిరసన చేస్తూ.. ఆందోళన బాటలో ఉన్న అంగన్‌వాడీ కార్మికులు, సహాయకులు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అదే జోరు కొనసాగించారు.



ప్రభుత్వానికి ఓటేసి తప్పు చేశామని గుంజీలు తీస్తున్న అంగన్వాడీలు



మదనపల్లెలో నల్లబెలూన్లతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



వాల్మీకిపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటి కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు శుక్రవారం గుంజీలు తీస్తూ నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొమ్మరాజు భాగ్యలక్ష్మి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకురాలు మస్తాన్‌బీ, అధ్యక్షురాలు సిద్ధమ్మలు పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఓటేసి తప్పు చేశామంటూ చెంపలేసుకుని గుంజీలు తీస్తూ నిరసన తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను తెరవాలని ప్రభుత్వం నాలుగు శాఖలతో తలకిందులుగా తపస్సు చేసిందన్నారు. ఇప్పటి వరకు ఒక్క పిల్లాడికి కూడా సరైన తిండి పెట్టలేకపోయిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్లు విజయ, అరుణ, పావని, ఖాజాబీ, సుమలత, అరుణ, పద్మజ, లక్ష్మీదేవి, విజయమ్మ, రామాంజులమ్మ, ప్రవీణ, సబీనా, రమీజా, ఇందిరమ్మ, పద్మజ, శంకరమ్మ, మంజుల, భూదేవి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

- రాజంపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. పాదయాత్రలో అక్క, చెల్లెమ్మా అంటూ.. తలదువ్వి ముద్దు పెట్టి.. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని చెప్పి మోసం చేసి తమ చెవిలో పూలు పెట్టాడంటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, రాజంపేట ప్రాజెక్టు నాయకురాళ్లు ఈశ్వరమ్మ, అమరావతి, శివరంజని, నాగజ్యోతి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.
- మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నల్లబెలూన్లతో నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా టీడీపీ నాయకులు మోకాళ్లపై కూర్చుని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.
- బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు శుక్రవారం దీక్షా శిబిరంలో కబడ్డీ ఆడుతూ నిరసన తెలిపారు. ములకలచెరువు మండలం అంగన్వాడీ యూనియన్ నాయకురాలు చాంద్‌బీ తోటి అంగన్వాడీ కార్యకర్తలకు గెద్దె చెబుతూ ప్రభుత్వాన్ని తప్పు పట్టారు.
- తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీలు, సహాయకులు ఎర్రచీరలు ధరించి తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
- వాల్మీకిపురం ప్రాజెక్టు కార్యాలయం దీక్షా శిబిరం వద్ద మోకాళ్లపై నిలబడి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. కనీస వేతనాలు, డిమాండ్ల సాధన కోసం గడిచిన 25రోజులుగా, ఎంతో సామరస్యంగా సమ్మె చేస్తూ.. తమ గోడు చెప్పుకుంటున్నా.. సీఎంకు కనికరమే లేదన్నారు. శుక్రవారం వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గౌరవ వేతనం తమకొద్దని, తమ కష్టానికి కనీస వేతనం ఇచ్చి తీరాల్సిందేనని నినదించారు. ఎన్నికల ముందు ఓ మాట.. తరువాత ఓ మాట ప్రస్తుత ప్రభుత్వానికే చెల్లిందన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే.. రాబోయే రోజుల్లో సమ్మె మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, అమ్మాజీ, ప్రసన్న, లక్ష్మీనరసమ్మ, దేవసేన, రెడ్డిరాణి, వాల్మీకిపురం, కలికిరి, గుర్రంకొండ మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికులు

రాజంపేటలో 11వ రోజున మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగింది. ఉత్తుత్తి హామీలు ఇచ్చి.. తమకు పంగనామాలు పెట్టాడని, అందుకే గోవిందా గోవిందా అంటూ నినాదాలు చేస్తూ.. నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేల్ రవికుమార్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబయ్య, ప్రసాద్, లక్ష్మీదేవి, రమణ, బాలాజీ, ప్రమీల, మధు, పెంచలయ్య, గంగయ్యలు పాల్గొన్నారు.

- రాయచోటి మునిసిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు ఒంటిమీద ఆకులు చుట్టుకుని నిరసన తెలిపారు. రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చెన్నయ్య, రాంబాబు, అగ్గిరాముడు ఆధ్వర్యంలో కార్మికులు ఆకులు తింటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు.



రాయచోటిలో మెడలో ఆకులు వేసుకొని ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

రాష్ట్రంలో నియంత పాలన

- అభివృద్ధి నిరోధకుడు సీఎం జగన్
- రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, జనవరి 5: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నియంత పాలనకు తెరలేపారని, రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్య మంత్రి మోయని అపకీర్తిని మూటగట్టుకున్నారని రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి అనేది లేకుండా సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కులాల వారీగా విభజించి ఏడాదికి ఒకసారి బటన్ నొక్కుతూ మరోపక్క అంతకు పదిరెట్లు పేద ప్రజల నుంచి దోచుకుంటున్నారని విమర్శించారు. ఏపీ ప్రజల కలల రాజధాని అమరావతిని తొక్కేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రపంచంలో రాజధాని లేని ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నిలిచిపోయేలా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో మరోమారు అధికారంలోకి రావాలన్న అధికార దాహంతో ఎమ్మెల్యేలను మారుస్తున్నారని, ఎక్కడి నుంచి ఎక్కడికి మార్చి పోటీ చేయించినా రాష్ట్ర ప్రజలు నమ్మరనే విషయాన్ని సీఎం గుర్తించుకోవాలన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మార్చేందుకు సిద్ధమయ్యారనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. అమరావతిని రాజధానిగా చేసి విభజన హామీలతో నష్టపోయిన రాష్ట్ర ప్రజలకు అండగా ఉండాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రజా ఆమోదంతో కోట్లు వెచ్చించి చేస్తున్న అభివృద్ధిని తుంగలో తొక్కేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మిమ్మల్ని నమ్మి మోసపోయిన రాష్ట్ర ప్రజలు తమకు ఎవరు మంచి చేస్తారో తెలుసుకున్నారని, అందుకే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబును సీఎంగా గెలిపించుకునేందుకు కంకణం కట్టుకున్నారని తెలియజేశారు. ఐటీ రంగం ఆర్థిక వ్యవస్థలకు మూలంగా మారుతుందని, ఆ నాడు చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లో ఐటీ రంగాన్ని స్థాపించి వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలియజేశారు. అమరావతిని కూడా మరో హైదరాబాదుగా మార్చాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాంమోహన్‌నాయుడు, గ్రామ అధ్యక్షుడు సుబ్బరామ్, టీడీపీ నాయకులు ప్రసాద్‌రాజు, మాలేపాటి సురేశ్‌నాయుడు, ఎల్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈశ్వరీదేవి గురుపూజా మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, జనవరి 5: ఈశ్వరీ మహాదేవి అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారు సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్రదినం కావడంతో అమ్మవారి దర్శనంకోసం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం ఈశ్వరీదేవికి మఠాధిపతి దంపతులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలు పార్వతమ్మ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, సారె అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చన చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ జేఏసీ చైర్మన్ హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, ఈశ్వరీదేవి మాత మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, సుశీలమ్మ, విశ్వబ్రాహ్మణ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా : పుట్టా

బ్రహ్మంగారిమఠాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఈశ్వరీదేవి అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇటీవల నిర్మాణం చేపట్టిన అన్నదాన సత్రానికి వెళ్లారు. అక్కడ విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు ఘనంగా శాలువా, పూల మాలతో సన్మానించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రజలు ఒక్కసారి అవకాశమిస్తే ప్రజల రుణం తీర్చుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, నేతలు ప్రభాకర్‌యాదవ్, పెసల ఈశ్వర్‌రెడ్డి, సన్నపూరి శ్రీను, సర్పంచ్ నారాయణ, అంకిరెడ్డిపల్లె రామసుబ్బారెడ్డి, మీసాల దుగ్గిరెడ్డి, మల్లేపల్లె రమణయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఈశ్వరిదేవి అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలకు జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి హాజరయ్యారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామినీ దర్శించుకున్నారు.




అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మఠాధిపతుల దంపతులు, కుంకుమార్చనలో పాల్గొన్న మహిళా భక్తులు

గ్యాస్ గోడౌన్ తనిఖీ



సిలిండర్ల స్టాకును పరిశీలిస్తున్న వీఆర్వోలు

పెనగలూరు, జనవరి 5: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్ ఫిర్యాదుతో శుక్రవారం పెనగలూరు తహసీల్దారు శ్రీధర్‌రావు బృందం పెనగలూరు లోని ప్రగతి ఇండియన్ గ్యాస్ ఏజన్సీ గోడౌన్‌ను తనిఖీ చేసింది. గోడౌన్‌లోని సిలిండర్లను, కార్యాలయంలోని రికార్డులను, ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బీజేపీ జాతీయ ప్రతినిధి గ్యాస్ పథకం అమలుపై ఆరా తీశారు. సంబంధిత అధికారులు గానీ, సిబ్బంది గానీ, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది గానీ అందుబాటులో లేకపోవడంతో ఆయన వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు పెనగలూరు తహసీల్దారుకు గోడౌన్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో బ్లాక్ బోర్డుపై ప్రజలకు తెలిపే వివరాలు, గోడౌన్‌లో ఉన్న ఫుల్ సిలిండర్లు ఖాళీ సిలిండర్ల నిల్వల్లో తేడాలు గుర్తించారు. స్టాక్ రిజిస్టరులో ఉన్న వివరాలతో పాటు కంప్యూటర్‌లో ఉన్న వివరాలను కూడా పరిశీలించారు. 112 సిలిండర్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. కాగా, వికసిత్ భారత్ కార్యక్రమంపై గ్యాస్ యజమానికి గానీ, సిబ్బందికి గానీ ఈ కార్యక్రమ నోడల్ అధికారి సమాచారమివ్వలేదని తెలిసింది. గోడౌన్ తనిఖీలో ఆర్ఐ చంద్రమోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్‌కు మాతస్వామి, వీఆర్వోలు మౌలానా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 5: ఆలయం ముందు నమస్కారం చేసుకుంటున్న వ్యక్తిని సిమెంటు లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణానికి చెందిన దాడిశెట్టి నాగేంద్ర (36) తన తండ్రితో కలసి వ్యాపారం నిమిత్తం శుక్రవారం ఐర్ వాహనంలో వెళుతూ పాతబస్టాండ్ బలిజపల్లి గంగమ్మ ఆలయం వద్ద వాహనాన్ని ఆపి అమ్మవారికి నమస్కరిస్తుండగా ఎర్రగుంట్ల నుంచి సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో నాగేంద్ర అక్కడిఅక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుజని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేకోడూరు ఎస్ఐ-2 వెంకటేశ్వర్లు తెలిపారు.

అన్నదమ్ముల హత్య కేసులో ఆరుగురు అరెస్టు



హత్యకేసులో నిందితుల అరెస్టు చూపి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ వంశీధర్‌గౌడ్, సీఐ యుగంధర్

బద్వేలు టౌన్, జనవరి 5: పట్టణంలోని సిద్దవటం రోడ్డు అగ్నిమాపక కేంద్రం సమీపంలో గురువారం జరిగిన అన్నదమ్ముల హత్య కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, సీఐ యుగంధర్‌లు తెలిపారు. చిన్న గొడవ హత్యలకు దారి తీసిందని వెల్లడించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న పసుపులేటి ప్రశాంత్ (28), పసుపులేటి సాయికుమార్(25) గురువారం ఉదయం మార్కెట్‌యార్డు సమీపంలో ఉండగా సుమిత్ర నగర్‌కు చెందిన లకిడి వెంకట ప్రమోద్‌కుమార్ మధ్య ఘర్షణ జరిగింది. ఇది మనసులో పెట్టుకుని ప్రమోద్‌కుమార్ వెంటనే తన తండ్రి లకిడి విజయభాస్కర్ తమ్ముడు వెంకట తరుణ్‌తేజ్‌కు చెప్పడంతో వారు ఆగ్రహానికి గురై వెంటనే తన స్నేహితులైన భరత్‌కుమార్‌రెడ్డి, గణేశ్, ఉదయ్ కుమార్‌లతో కలసి మూడు ద్విచక్ర వాహనాల్లో వెదుకుతుండగా మృతులు పసుపులేటి ప్రశాంత్, సాయికుమార్‌లు సిద్దవటం రోడ్డులోని నారాయణ టీషాపు వద్ద ఉండడం గమనించి వారిపై దాడికి పాల్పడ్డారు. అన్నదమ్ములిద్దరినీ కత్తితో దాడి చేసి బండరాళ్లతో ఒంటిమీద తీవ్ర గాయాలయ్యేలా కొట్టడంతో అధిక రక్తస్రావం కావడంతో ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న సాయికుమార్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ విషయం దర్యాప్తు అధికారి సీఐ యుగంధర్ విచారణ చేపట్టి హత్యకు కారకులైన ఆరుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి మూడు ద్విచక్ర వాహనాలను, హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అల్లరి మూకలు ఘర్షణలకు పాల్పడినట్లు సమాచారం వస్తే ఉపేక్షించేది లేదని, ఎంతటి వారైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గండికోట బ్యాక్ వాటర్‌లోకి 4.7 లక్షల చేపపిల్లలు

కొండాపురం, జనవరి 5: గండికోట బ్యాక్‌వాటర్‌లోకి కొండాపురం సమీపంలో శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో సుమారు 4.7 లక్షల చేపపిల్లలను నీటిలోకి వదిలారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారులు మాట్లాడుతూ గండికోట జలాశయంలో చేపలు పట్టే మత్స్యకారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, మత్స్యశాఖ డీడీ శాంతి, తహసీల్దార్ శోభన్‌బాబు, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో పీజీ డిప్లమా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప(ఎడ్యుకేషన్), జనవరి 5: వైవీయూలో జర్నలిజం, లలిత కళల విభాగంలో పోస్టుగ్రాడ్యుయేషన్ డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పరీక్షల సంచాలకులు ప్రొఫెసరు కంకణాల గంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ లో పు నేరుగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో పోస్టుగ్రాడ్యుఏషణ్ డిప్లమా ఇన్ పబ్లిక్ రిలేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ తెలుగు జర్నలిజం ఫైన్‌ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. బ్యాచ్‌లర్ డిగ్రీ పూర్తిచేసిన వారు ఎవరైనా ఈ కోర్సులు చేసేందుకు అర్హులన్నారు. ఈ కోర్సుల తరగతులు పూర్తిగా సాయంత్రం నిర్వహించనున్న నేపథ్యంలో వైవీయూలో పీజీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు కూడా చేరవచ్చని తెలిపారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

● 113 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

కడప(క్రైం), జనవరి 5: చెన్నూరులో శుక్రవారం విజిలెన్స్ అధికారుల దాడులు నిర్వహించి 113 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారుల వివరాల మేరకు.. వనం వీధిలోని ఓ ఇంట్లో చెన్నూరుకు చెందిన కాటం బ్రహ్మయ్య అనే వ్యక్తి రేషన్ బియ్యం సేకరించి అక్రమంగా నిల్వ ఉంచి కర్నాటకకు రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచాడనే సమాచారం రావడంతో విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఉదయం దాడులు చేశారు. కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి షేక్ మసూంబాష ఆదేశాల మేరకు కాటం బ్రహ్మయ్యను అదుపులోకి తీసుకున్నారు. ఇంటిని తనిఖీ చేయగా అందులో 5270 కేజీల రేషన్ బియ్యం 113 బస్తాలు ఉన్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.2,13,435గా తేల్చారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని చెన్నూరు ఎంఆర్ఐకి అప్పగించారు. ఆయనపై చెన్నూరు పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, బాలగంగాధర్‌రెడ్డి, ఏఓ మురళీక్రిష్ణ, పి.సౌజన్య, చెన్నూరు ఎంఆర్ఐ, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్‌రావు, రంతుబాషా తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తాం

● మదనపల్లె డీఎస్పీ కేశప్ప

పెద్దతిప్పసముద్రం, జనవరి 5: ఏపీలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టుల్లో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు మదనపల్లె డీఎస్పీ కేశప్ప స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మండలంలోని కర్ణాటక సరిహద్దులోని పలు చెక్‌పోస్టులను తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు రాబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బందోబస్తును ఏర్పాటు చేయనున్నామని, కర్ణాటక ప్రాంతం నుంచి మద్యం, రాష్ట్రానికి తరలిరాకుండా సరిహద్దులో కట్టుదిట్టం చేస్తామన్నారు. ఎన్నిక నేపథ్యంలో సంఘ విద్రోహ శక్తులు, రౌడీషీటర్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సమాచారం ఉన్నా, పోలీసులకు తెలియజేస్తే తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట సీఐ మధు, ఎస్ఐ రవీంద్రబాబు తదితరులు ఉన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం - ఇద్దరి అరెస్టు

పెద్దమండ్యం, జనవరి 5: మద్యం బాటిళ్లతో పాటు ఇరువురిని గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు పెద్దమండ్యం ఎస్ఐ రామాంజనేయుడు శుక్రవారం వెల్లడించారు. ఎస్ఐ కథనం మేరకు పెద్దమండ్యం మండలం బండ్రేవు గ్రామ పంచాయితీ కొత్తపల్లికు చెందిన రమణయ్య, నాగభూషణం ఇద్దరు పెద్దమండ్యం సమీపంలోని పంప్‌హౌస్ వద్ద 180 ఎంఎల్ స్థాయి కలిగిన 60 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే మండలంలోని దిగువపల్లి పాపాఘ్ని నదిలో ఇసుక తరలిస్తుండగా ఒక ట్రాక్టర్‌ను, ఒక ఇటాచీ యంత్రాన్ని స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ఎస్ఐ తెలిపారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలు, అపరిచితుల సంచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏఎస్ఐ ఇసాక్ తెలిపారు.

ఆక్రమణ అడ్డుకున్నందుకు కత్తితో దాడి యత్నం



కత్తితో దాడికి యత్నిస్తున్న కబ్జాదారుడు

ఓబులవారిపల్లె,జనవరి 5: పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలోని 1150 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించక పోవడంతో శుక్రవారం కొందరు స్థానికులు పనులను అడ్డుకున్నారు. దీంతో కాకర్లవారిపల్లెకు చెందిన గడుపర్తి చెంగయ్య అనే వ్యక్తి మచ్చుకత్తి తీసుకొని దాడికి ప్రయత్నించారని వారు తెలిపారు. తనకు అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు, రెవెన్యూ అధికారులు అనుకూలంగా ఉన్నారని బెదిరిస్తున్నాడని తెలిపారు.

సౌత్‌జోన్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థి



విద్యార్థి రాకేష్, కోచ్ బాలగోవింద్ తివారిని అభినందిస్తున్న డైరెక్టర్

వేంపల్లె, జనవరి 5: సౌత్‌జోన్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థి కె.రాకేష్ ఎంపికైనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. 53 కేజీల సబ్ జూనియర్ విభాగంలో వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలలో సత్తా చాటి సౌత్‌జోన్‌కి ఎంపియ్యాడన్నారు. జనవరి 19 నుంచి 21 వరకు తెనాలిలో జరగనున్న సౌత్‌జోన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననున్నారన్నారు. ఈ సందర్భంగా కె.రాకేష్, కోచ్ బాలగోవింద్ తివారిని అభినందించారు.

బంగారు చోరీ

చాపాడు, జనవరి 5: మండలంలోని మొర్రాయిపల్లెలో కొప్పర్ల పుల్లయ్య అనే వ్యక్తి ఇంటిలో ఈ నెల 4న గురువారం రెండున్నర తులం బంగారం చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. దీని విలువ సుమారు రూ.2.20 లక్షలు ఉంటుందన్నారు. పుల్లయ్య కూలీ పనికి వేరే గ్రామానికి వెళ్లగా... అతని భార్య పొలం వద్దకు వెళ్లింది. ఆ సమయంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాన్ని పగులకొట్టి బంగారాన్ని దొంగలించినట్లు తెలిపారు. పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

మైలవరం, జనవరి 5: మండల పరిధిలోని బుచ్చంపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు అరెస్టుచేసి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ సరస్వతి తెలిపారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

రైల్వేకోడూరు(రూరల్) జనవరి 5: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని బుడుగుంటపల్లిలో శుక్రవారం ప్రతి గడపగడపకు పంపిణీ చేస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ సభ్యుడు తోట శ్రీనివాసులు తెలిపారు. మండలం లోని అన్ని గ్రామాల్లో అక్షింతలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుడుగుంటపల్లి గ్రామస్తులు సిద్ధేశ్వర, రమణ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: రాజంపేట మండలం భువనగిరిపల్లెలో అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను శుక్రవారం సాయంత్రం గ్రామ ప్రజలు ఊరేగించారు. లక్ష్మీనరసింహ ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైద్యాధికారి మృతి


ముస్తాక్ అహ్మద్ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, జనవరి 5: దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ముస్తాక్ అహ్మద్ గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దేవపట్ల ఆరోగ్య కేంద్రంలో ఆయన నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వైద్యాధికారులు సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్‌నాయక్, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, సంబేపల్లె, వైద్య సిబ్బంది ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రైబర్ వెల్ఫేర్ ఇన్‌చార్జిగా జాకీర్‌హుస్సేన్



రాయచోటి(కలెక్టరేట్), జనవరి 5: అన్నమయ్య జిల్లా ట్రైబర్ వెల్ఫేర్ ఏడీ ప్రమోషన్‌పై రంపచోడవరం వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో డీఎస్‌డబ్ల్యూఈవో ఏడీ జాకీర్ హుస్సేన్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు.

గడ్డి విత్తనాలు సద్వినియోగం చేసుకోండి


గడ్డి విత్తనాలను అందజేస్తున్న మాలకొండయ్య

లక్కిరెడ్డిపల్లె, జనవరి 5: సబ్సిడీపై ఇస్తున్న గడ్డి విత్తనాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ మాల కొండయ్య కోరారు. శుక్రవారం పందిళ్లపల్లెలో వందశాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీపై గాలికుంటు మందులు, గడ్డివిత్తనాలు, దాణా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పశువైద్యాధికారులు ఇంటి వద్దకు పరీక్షలు నిర్వహించడంతోపాటు, గాలికుంటు టీకాలు వేస్తారన్నారు. బోరు, అర ఎకరం పొలం ఉన్న ప్రతి రైతు గడ్డి విత్తనాలను ఉపయోగించుకోవచ్చున్నారు. పాడి రైతులు పశుఆరోగ్య కార్డు పొందాలన్నారు.ఈ కార్డులో పశువుల ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పశువైద్యాధికారి రవికుమార్, పశువైద్యాదికారి మహేష్, ప్రసన్నబాబు, పాల్గొన్నారు

సేవాగుణంతో సమాజానికి మేలు

పెనగలూరు, జనవరి 5: విద్యార్థులు సమాజానికి సేవ చేయడం గొప్ప భాగ్యమని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సహజబ్లెస్సీ అన్నారు. ఎన్ ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదర్శ జూనియర్ కళాశాల విద్యార్థినులు శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యాబుద్ధులతో పాటు సమాజానికి సేవ చేసేగుణం అలవర్చుకుంటే సమాజానికి ఎంతో మేలు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్‌హేమలత, క్రిష్ణవేణి, గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


మదర్ థెరిస్సా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నందలూరు, జనవరి5 : విద్యార్థులు ఇతర రంగాల లోనూ రాణించాలని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి సూచించారు. స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కౌట్ గ్రూపు 25వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం వేపగుంట శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ముందుగా మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ ఎం.నాగేంద్ర ప్రసాద్, లోక్ మాన్° ంగ్, రాజేంద్రకుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బాలు, సాదిక్, వినయ్ కుమార్, సంస్థ సభ్యులు జశ్వంత్, ప్రకాష్‌రాజ్, రెడ్డిశేఖర్, మన్మథ తదితరులు పాల్గొన్నారు.

స్పందించకపోతే సంక్రాంతి సంబరాలు రోడ్డుపైనే..!


సుండుపల్లెలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

సుండుపల్లె, జనవరి 5: అంగన్వాడీల సమస్యలపై స్పందించకపోతే సంక్రాంతి సంబరాలు కూడా మండల కేంద్రంలో రోడ్లపైనే నిర్వహించి నిరసన తెలియజేస్తామని ఏఐటీయూసీ జిల్లా నాయకురాలు నాగేశ్వరి, మండల అధ్యక్షురాలు సుజాత హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని 14 గ్రామ పంచాయతీల కార్యకర్తలు మండల కేంద్రానికి వచ్చినిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు రోడ్డెక్కి నిరసన తెలియజేస్తున్నా కనీసం కనికరం లేని వ్యక్తి సీఎం అని విమర్శించారు. ఇదే తంతు కొనసాగితే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. న్యాయమైన డిమాండ్లను ఇచ్చిన హామీని పరిష్కరించలేని ముఖ్యమంత్రిని ఎలా నమ్మాలని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ లీడర్లు పాల్గొన్నారు.

రాయచోటిలో గుంజీలు తీస్తూ...

రాయచోటి(కలెక్టరేట్): సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొమ్మరాజు భాగ్యలక్ష్మి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకురాలు మస్రూన్‌బీ, అధ్యక్షురాలు సిద్దమ్మ హెచ్చరించారు. 25వ రోజు సమ్మె సందర్భంగా శుక్రవారం రాయచోటిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఓటేసి తప్పు చేశామంటూ చెంపలేసుకుని గుంజీలు తీస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె ప్రారంభమై 25వ రోజులవుతున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర విషయాల్లో ప్రభుత్వం నోరు మెదపలేదన్నారు. గతంలో జరిగిన చర్చల్లో మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని అంగీకరించారని, ఇప్పటి వరకు దీనికి సంబంధించి జీవో ఇవ్వలేదన్నారు. అంగన్వాడీ గ్రేడ్-2 సూపర్‌వైజర్ 560 పోస్టులు ఇచ్చామని మంత్రి ఉషశ్రీ చరణ్ అబద్ధాలు చెబుతున్నారన్నారు. అంగన్వాడీ కేంద్రాలను తెరవాలని ప్రభుత్వం నాలుగు శాఖలతో తలకిందులుగా తపస్సు చేసిందన్నారు. ఇప్పటి వరకు ఒక్క పిల్లాడికి కూడా సరైన తిండి పెట్టలేకపోయిందన్నారు. ప్రభుత్వం అద్దెలు ఇవ్వకపోయినా గర్భిణులు, బాలింతలకు పోషణ అందించామన్నారు. వేతనాలు పెంచకపోతే ఇతర డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. తమ ఆందోళనలకు రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు, లౌకిక ప్రజాతంత్ర వాదులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ లీడర్లు విజయ, అరుణ, పావని, ఖాజాబీ, సుమలత, అరుణ, పద్మజ, లక్ష్మీదేవి, విజయమ్మ, రామాంజులమ్మ, ప్రవీణ, సబీనా, రమీజా, ఇందిరమ్మ, పద్మజ, శంకరమ్మ, మంజుల, భూదేవి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలుచుని..

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డి పల్లెలో మోకాళ్లపై నిలుచుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హామీలను అమలు చేయాలని, మహిళలను వేధించడం మంచిది కాదన్నారు ఎన్నికలు కేవలం 3 నెలలు మాత్రమే ఉన్నాయని వచ్చే ఎన్నికల్లో అంగన్ వాడీలు అంటే ఏమిటో తెలుస్తుందన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శులు ఓబులమ్మ, ప్రభావతి, వీరీష, రుక్మిణి, వాణి, లక్ష్మీదేవి, నాగవేణి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాలకు చెందిన అంగన్‌వాడీలు,ఆయాలు పాల్గొన్నారు

చెవిలో పూలు పెట్టుకుని..

రాజంపేట: రాజంపేటలో అంగన్‌వాడీలు చెవిలో పూలు పెట్టుకొని శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ, రాజంపేట ప్రాజెక్టు నాయకురాలు ఈశ్వరమ్మ, అమరావతి, శివరంజిని, నాగజ్యోతి, నాగమణి తదితరులు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మె 25 రోజులు అవుతున్నా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకపోవడం బాధాకరమని దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా మనసు మార్చుకొని తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.

ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసే వరకు సమ్మె


రాజంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రాయచోటిటౌన్, జనవరి5: మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేసేంతవరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, రాంబాబు అన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె 11వ రోజు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మెడలో ఆకులు, గడ్డి మోకులు వేసుకుని ర్యాలీగా బంగ్లా వరకు వెళ్లి తిరిగి మున్సిపల్ కార్యాలయం చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లుగా విసిగి వేసారిన కార్మికులు సమ్మెబాట పట్టారన్నారు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను జగన్ గాలికి వదిలేశాడన్నారు. జీవోఆర్‌టీ నెంబర్ 30 ప్రకారం పంపు ఆపరేటర్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వర్కర్స్, వర్క్ ఇన్° స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, స్ట్రీట్ లైటింగ్, టౌన్‌ప్లానింగ్, ఆఫీసు నిర్వహణ కార్మికులకు మూడేళ్లుగా హామీలతోనే సరిపెడుతున్నారని విమర్శించారు. ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం దగా చేస్తున్నదన్నారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్న హామీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. పట్టణాల విస్తీర్ణం, జనాభా పెరుగుదల దృష్ట్యా కార్మికుల సంఖ్యను పెంచడం లేదన్నారు. కరోనా సందర్భంగా తీసుకున్న అదనపు సిబ్బందికి ఉద్యోగ భద్రత లేదన్నారు. సీపీఎస్ రద్దు చేస్తామన్న హామీని విస్మరించారన్నారు. ఈ సమ్మెతోనైనా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని కోరారు. వీరి సమ్మెకు అంగన్వాడీ లీడర్లు సంఘీభావం తెలిపారు. సిద్దయ్య, సిద్దమల్లు, అశోక్, రవికుమార్, వెంకట్రమణ, మంగమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: రాజంపేటలో మున్సిపల్ కార్మికులు గోవిందా.. గోవిందా.. ఇచ్చిన మాట గోవిందా.... అంటూ నినాదాలు చేస్తూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబయ్య, ప్రసాద్, లక్ష్మీదేవి, రమణ, బాలాజీ, ప్రమీల పాల్గొన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టాలి


సుండుపల్లెలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు


ఊటుకూరు అరుంధతివాడలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నేతలు

సుండుపల్లె, జనవరి 5: వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని.. చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు పిలుపునిచ్చారు. సుండుపల్లెలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుండుపల్లెలోని కృష్ణానగర్, ఆనంద్ నగర్‌లలో ఇంటింటికి టీడీపీ కార్యకర్తలు వెళ్లి పని చేస్తున్నారా లేదా అని ఆరాతీశారు. పార్టీ కోసం పనిచేసిన వారికే ప్రాధాన్యం ఉంటుందని తెలియజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప తదితరులను అభినందించారు. ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలియజేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు మంచి జరిగేలా కంపెనీలను తీసుకువస్తారని వివరించారు. వలంటీర్ల సాయంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్న వారికి బుద్ధి చెప్పాలన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తూనే మరో పక్క రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడపగల శక్తి చంద్రబాబునాయుడుకు మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాంమోహన్‌నాయుడు, ప్రసాద్ రాజు, నాయకులు రియాజ్, ఎల్వీ రమణ, మాలేపాటి సురేశ్‌నాయుడు పాల్గొన్నారు.

రాజంపేట : ఊటుకూరులో బూత్ కన్వీనర్ కర్ణాటకం చెంగల్‌రాయుడు నేతృత్వంలో మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, యువ నాయకుడు చంద్రబాబు నాయుడు తదితరులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఇకనైనా టీడీపీని అధికారంలోకి తెచ్చి తమ భవిష్యత్తును మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శివనారాయణ, రమణ, ఓబయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి


కూరగాయలను పరిశీలిస్తున్న జడ్జి లత

నందలూరు, జనవరి 5: విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, ఆ సమయంలో ఆకర్షణకులోను కాకుండా సన్మార్గంలో నడవాలని మండల సర్వీసెస్ కమిటీ చైర్మన్, నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోలార్ లత సూచించారు. శుక్రవారం ఆమె మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం అందుతోందా లేదా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు నాసిరకంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. పిల్లలకు ఇలాంటివి పెడితే ఎలా అని ప్రిన్సిపాల్‌ను, సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం విద్యార్థులతో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మ స్థైర్యంతో ఉండాలని, ఎటువంటి సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు జీవితాన్ని కాలరాస్తాయని తెలియజేశారు. ఉన్నత శిఖరాన్ని అధిరోహించాలంటే తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మాట వినాలని, వారు సెల్‌ఫోన్ వాడరాదని, వాట్సప్ చాటింగ్ ఆన్‌లైన్ చాటింగ్ చేస్తే నేరాలు చేసినవారవుతా రన్నారు. ప్రతి విద్యార్థి సేఫ్ ఎన్విరాన్మెంట్‌లో సేఫ్ హ్యాండ్స్‌లో ఉంటూ బాగా చదువుకొని అనుకున్న వన్నీ సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్‌జహీర్, కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు స్టాఫ్, పీఎల్‌వి సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ హయాంలో అన్ని రంగాల్లో రాష్ట్రం సర్వనాశనం


సమావేశంలో మాట్లాడుతున్న పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట, జనవరి 5 : జగన్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వనాశనమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల పరిశీలకుడు పోతుగుంట రమేష్‌నాయుడు విమర్శించారు. శుక్రవారం రాజంపేట బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం దివాళా తీసిందని, పంచాయతీ రాజ్ హక్కులను మరిచారని, ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, యువతకు ఉపాధి లభించలేదన్నారు. భౌగోళికంగా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుకూల పరిస్థితులున్నా ఆ పని చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్ నిధులను కూడా దారి మళ్లించి వారిని ఇబ్బందులపాలు చేశారన్నారు. రూ. 12 లక్షల కోట్లు అప్పులు చేయ డమే ఆయన సాధించిన ఘనత అని ఎద్దేవా చేశారు. ప్రతి పౌరుడి నెత్తిన రూ.2.50 లక్షలు భారం వేసిన నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అని తూర్పారబట్టారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, రైల్వేకోడూరు అసెంబ్లీ కన్వీనర్ చంగల్‌రాజు, బీజేవైఎం నాయకుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో పారిశుధ్య పనులు

పుల్లంపేట, జనవరి 5: మండల కేంద్రంలో శుక్రవారం సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి పెంచలయ్య ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. సం క్రాంతి సందర్భంగా పంచాయతీని సుందరంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో పనులు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

పెన్షన్ కానుక పంపిణీకి ఎంపీపీ డుమ్మా!

పుల్లంపేట, జనవరి 5 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి గైర్హాజరయ్యారు. కొన్ని నెలలుగా పలు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు ఆయన డుమ్మా కొడుతూ వచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ పరిస్థితిపై మండలంలో పెద్దగా చర్చ జరుగుతుంది. మండలంలో మంచి పట్టున్న ముద్దా బాబుల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కానీ, వైసీపీ వచ్చిన తరువాత కూడా పార్టీ కోసం అహర్నిశలు పనిచేశారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తమ వైపు తిప్పుకోవడంలో సఫలీకృతులయ్యారు. ప్రస్తుతం పుల్లంపేటకు అభివృద్ధిలో ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ఎంపీపీ అలకబూనినట్లు తెలుస్తోంది.

ఆడిట్ కార్యాలయంలో రికార్డుల తనిఖీ

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 5: అన్నమయ్య జిల్లా ఆడిట్ కార్యాలయంలో రీజనల్ డైరెక్టర్ గోవిందప్ప శుక్రవారం రికార్డులు తనిఖీ చేశారు. నాలుగు నెలలుగా అమల్లోకి వచ్చిన ప్రీ ఆడిట్‌పై సంబంధిత అధికారి నాగరాజును అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రక్రియ జిల్లా అంతటా అమలయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. జిల్లాలో ఇబ్బందులు లేకుండా అన్ని సంస్థల్లో జాగ్రత్తగా ఆడిట్ నిర్వహించాలని వారు ఆదేశించారు. ఇక్కడ ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆడిటర్లు డీఏవో నాగరాజు పాల్గొన్నారు.

రంగోత్సవాల్లో గురుకుల విద్యార్థులకు బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

రామాపురం, జనవరి5: రంగోత్సవం లో భాగంగా సెప్టెంబరు 23న బాం బేలో నిర్వహించిన నేషనల్ డ్రా యింగ్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వీవీ ప్రసాద్ తెలిపారు. ఈ పోటీలకు తమ పాఠశాల నుంచి 40 మంది హాజరుకాగా 20 మంది పతకాలు అందుకున్నారన్నారు. పాఠశాల సిబ్బందికి, ఆర్ట్ మాస్టర్ ఆనంద రాజుకు ఆయన అభినందనలు తెలియజేశారు.

వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు


అమ్మవారి ఇరుముడితో ఊరేగింపుగా తరలివస్తున్న భక్తులు

చిట్వేలి, జనవరి 5: మండలంలోని కె.ఎస్.అగ్రహారం ఈశ్వరీదేవి మఠంలో ఆరాధనోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉరవకొండ అనంతపురం, తాడిపత్రి, బళ్లారి, ఉమ్మడి కడప జిల్లాలో అమ్మవారి మాల ధరించిన భక్తులు ఇరుముడితో గురువారం సాయంత్రానికి స్థానిక సాయివికాస్ పాఠశాలకు చేరుకున్నారు. శుక్రవారం చిట్వేలి నుంచి కె.ఎస్.అగ్రహారం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఒంగోలుకు చెందిన పరిపూరానంద స్వామి కార్యక్రమాలను పర్యవేక్షించారు. మఠాధిపతి రంగయ్యస్వాముల ఆశీస్సులతో ఆరాధనోత్సవాలను నిర్వహించినట్లు అర్చకుడు వినయకుమార్ ఆచారి, కార్యనిర్వాహకులు తెలియజేశారు.

పూత దశలో సస్యరక్షణతో మంచి దిగుబడులు


శిక్షణ ఇస్తున్న ఉద్యాన అధికారి నాగమణి

లక్కిరెడ్డిపల్లె, జనవరి 5: మామిడిలో పూత దశలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యానవన శాఖ అధికారి నాగమణి తెలిపారు. శుక్రవారం మండలంలోని దిన్నెపాడు, బి ఎర్రగుడి గ్రామాల్లో మామిడి తోటలను పరిశీలించి రైతులకు శిక్షణ ఇచ్చా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ తెల్ల పూత దశలో, తేనెమంచు పురుగు, బూడిద తెగులు, మసితెగులు, పక్షికన్ను తెగులు నివారణకు మోనోక్రోటోఫాస్, మ్యాంకోజెబ్, పిచికారీ చేయాలన్నారు. పూత పిందె దశలో తేనె మంచు, తామరపురుగు, ఎక్కువగా ఆశించే అవకాశం ఉందన్నారు. పదేళ్లు నిండిన చెట్లకు యూరియా, పొటాష్ వెయ్యాలన్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో 15 రోజులకో సారి నీటి తడులను ఇవ్వాలన్నారు. ఈ రెండు నెలల్లో తొడిమ కుళ్లు తెగులు నివారణకు అమిస్టార్ లేదా నాటివో పిచికారీ చేస్తే పిందె నిల బడుతుందన్నారు. రైతులు ప్రతి రోజు మామిడి పూత ఏ దశలో వస్తున్నది గమనించా లన్నారు ఈ కార్యక్రమంలో రైతుభరోసా కేంద్రం సిబ్బంది హరిత, రమేష్‌రెడ్డి, అనూష, పావని, రైతులు పాల్గొన్నారు .

జాతీయ రగ్బీ పోటీల్లో రాణించిన దిలీప్‌కుమార్


దిలీప్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు, జనవరి 5: మండలంలోని టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి జి.దిలీప్‌కుమార్ అండర్-14 జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించాడని హెచ్‌ఎం శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ పి.గణేష్‌బాబు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఆ క్రీడాకారుడిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ విద్యార్థి జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు రమేష్‌బాబు, మస్తానయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, రజియాబేగం, శశికళ, మోహన్‌రాజు, అసిస్టెంట్ చాంద్ బాషా, పాఠశాల సిబ్బంది, నాగార్జున, బాదుల్లా, యాసిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రామచంద్రయ్యతో టీడీపీ నేతల భేటీ

రాజంపేట, జనవరి 5: టీడీపీలో చేరిన ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్యను కడపలోని ఆయన ఇంట్లో శుక్రవారం రాజంపేట టీడీపీ నేతలు కలిసి సత్కరించారు. ఒంటిమిట్ట టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పలుకూరి ఉగ్రవీంద్ర, బీసీ నాయకులు ట్రాన్స్‌పార్మర్ శ్రీనివాసులు, న్యాయవాది సుబ్బరాయుడు, మాధవరం టీడీపీ నాయకులు శివప్రసాద్, పెన్నపేరూరు గ్రామ సర్పంచ్ లక్ష్మీనరసయ్య, యల్లయ్య యాదవ్, రవిశంకర్, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

గడికోట ద్వారకనాథరెడ్డికి అభినందనలు

రామాపురం, జనవరి 5: తెలుగుదేశం పార్టీలో చేరిక అనంతరం మండలానికి తిరిగి వచ్చిన మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డిని శుక్రవారం పలువురు అభినందించారు. రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు రవీంద్ర బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగసుబ్బారెడ్డి, అనుంపల్లె రాంప్రసాద్‌రెడ్డి, గాలివీడు మండల మాజీ ఎంపీపీ ప్రభాకర్‌నాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు అయోధ్యాపురం భూషణ్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, రేకం ఆంజనేయులు, రాజశేఖర్, శివయ్య, లోకేశ్, ధర్మయ్య, చాన్‌బాషా, ముప్పాల వెంకటరామరాజు, మద్దిరేవుల బాబురెడ్డి, సంబేపల్లె గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే, జడ్పీ మాజీ చైర్మన్


ప్రార్థన చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

రాయచోటిటౌన్, జనవరి5: రాయచోటి పట్టణంలోని బండ్లపెంట ప్రాంతంలో గల హాసన్‌బాబా దర్గా ఉరుసులో జడ్పీ మాజీ చైర్మన్, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఇర్షాద్‌అలీఖాన్, మాజీ కోఆప్షన్ సభ్యులు సలావుద్దీన్, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం


జెండా ఊపి వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కొండూరు అజయ్‌రెడ్డి

పెనగలూరు, జనవరి 5: మండలంలోని పొందలూరు, కాకర్లవారిపల్లెలో శుక్రవారం ఈవోపీఆర్‌డీ బాలకుమార్ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్, ఏపీఎస్‌డీసీ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వ పథకాలేవో, రాష్ట్ర ప్రభుత్వ పథకాలేవో తెలియకపోవడంతో పలువురు అధికారులు ఊరికే ఉండిపోయారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు మాత్రం హాజరు వేయించు కున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హేమనవర్మ, ఇ. సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు యాపీ సుబ్బ రాయుడు, తహసీల్దారు శ్రీధర్‌రావు, ఎంపీడీవో వరప్రసాద్, ఏవో పద్మభూషణ్‌రెడ్డి, సీహెచ్‌వో సురేంద్రనాథ్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ హరిప్రసాద్, నోడల్ ఆఫీసరు మురళీ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.13 కోట్ల మెగా చెక్కు అందజేత



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 5: అర్హులై ఉండి గతంలో ప్రయోజనం పొందని వారికి ద్వైవార్షిక లబ్ధికింద సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్నారు. ఇలా జిల్లాలోని 2065 మందికి రూ.3.13 కోట్ల చెక్కును శుక్రవారం కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షన్మోహన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, డీఆర్డీఏ పీడీ తులసి, సంక్షేమశాఖ అధికారి రాజ్యలక్ష్మి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బాని బాషా, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, డీఈవో విజయేంద్ర రావు, డీఎల్డీవో రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 5: గడచిన 24 గంటల్లో మూడు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. సదుంలో 3.4, శాంతిపురంలో 2.4, సోమలలో 1.0 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.

18 నుంచి కార్మిక బీమాపై స్పెషల్ డ్రైవ్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 5: కార్మికుల శ్రేయస్సు, భద్రత కోసం కార్మిక శాఖ ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు 10రోజుల పాటు జిల్లా అంతటా ఇన్స్యూరెన్స్ కల్పనకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం జేసీ తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. జేసీ మాట్లాడుతూ వలంటీర్ల సహకారంతో కార్మికులందరితో రూ.110 ఇన్స్యూరెన్స్ ప్రీమియం చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇన్స్యూరెన్స్ చేసుకున్న కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, దివ్యాంగుడైతే రూ.25 వేల నుంచి రూ.5 లక్షల వరకు, సాధారణ మరణానికి రూ.60 వేలు, పిల్లల వివాహాలకు రూ.20 వేలు, కాన్పులకు రూ.20 వేలు అందిస్తారన్నారు. కార్మికుల్లో నైపుణ్యత పెంపుకోసం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపకార వేతనం కూడా చెల్లిస్తామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకార్ రావు, డీఆర్డీఏ పీడీ తులసి, డ్వామా పీడీ గంగాభవాని, పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), జనవరి 5: కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తిరుపతికి చెందిన సతీష్ రూ.1,01,116ను శుక్రవారం విరాళంగా అందించారు. విరాళ దాతను సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పూరి టు హిమాలయాలు

ఆస్ట్రేలియా వనిత నడక ప్రయాణం



వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో జోడి

పుత్తూరు, జనవరి 5: ఆది శంకరాచార్య ఆధ్యాత్మిక ప్రేరణతో పూరి నుంచి దక్షిణ భారతదేశం మీదుగా హిమాలయ పర్వతాల వరకు ఒంటరిగా ఎనిమిది నెలలు నడిచేందుకు ఓ విదేశీ వనిత శ్రీకారం చుట్టింది. ఆస్ట్రేలియా దేశం పెర్త్ నగరానికి చెందిన ఆమె పేరు జోడి. వయస్సు 31 సంవత్సరాలు. డిగ్రీ వరకు చదివి యోగా టీచర్‌గా పని చేస్తోంది. మెడిటేషన్, మ్యూజిక్ అంటే ఇష్టం. భిన్న భాషలు, మతాలు వున్న భారత్‌ను ఆధ్యాత్మికత కలిపి వుంచుతోందని ఆది శంకరాచార్యుల బోధనలతో తెలుసుకుంది. స్వయంగా చూసిన అనుభవంతో పుస్తకం రాయాలని భావించింది. ఎనిమిది నెలల ఒంటరి ప్రయాణానికి ఇంటి నుంచి బయలుదేరి పూరి చేరుకుంది. 53 రోజులుగా నడుస్తూ తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని గురువారం రాత్రి పుత్తూరుకు చేరుకుంది.శుక్రవారం ఉదయాన్నే తిరిగి ప్రయాణాన్ని ప్రారంభించి పుత్తూరు డిగ్రీకళాశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి తన అభిప్రాయాలను పంచుకుంది.రోజూ సరాసరి 30 కిలోమీటర్లు నడుస్తున్నానని చెబుతున్న ఆమె తమ దేశంలో వున్న వాతావరణ పరిస్థితులే ఇక్కడా వున్నాయంటోంది. తన నడకతో మహిళల్లో కూడా ధైర్యం నింపుతానంటోంది. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ రవిరాజు, మాధవనాయుడు, మునికృష్ణయ్య, రామచంద్రనాయుడు, రఘునాధరెడ్డి, రఫీ ఆమెను శాలువాతో సన్మానించి నగరి వైపు కొంత దూరం కూడా వెళ్లి వీడ్కోలు పలికారు.

తిరుపతికి 'స్వచ్ఛ' అవార్డు

తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షణ్-2023 జాతీయస్థాయి పురస్కారాల్లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు చోటు దక్కింది. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన పారిశుధ్య సర్వేలో దేశంలోనే ఉత్తమ నగరాలుగా గ్రేటర్ విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరపాలక సంస్థలు నిలిచాయి. తిరుపతి నగరం గతంలో బెస్ట్ స్మాల్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్ (2021), సఫాయి మిత్ర సురక్షిత్ ప్రెసిడెంట్ అవార్డు (2022) జాతీయ అవార్డులను కైవసం చేసుకుంది. ఈసారి కూడా జాతీయస్థాయి అవార్డు రావడం పట్ల కమిషనర్ హరిత హర్షంవ్యక్తంచేశారు. ఈనెల 11న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నట్లు ఆమె చెప్పారు. తిరుపతి ప్రజల సహకారం, కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది పనితీరు, అధికారుల సమన్వయంతోనే ఇది సాధ్యమైందన్నారు.

లడ్డూ మూడు రోజులకే పాడైపోతోంది

తిరుమల గదుల్లో గీజర్లు పనిచేయడం లేదు

డయల్ యువర్ ఈవోలో భక్తుల ఫిర్యాదులు



తిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో పదిపదిహేను రోజులు నిల్వ ఉండే లడ్డూలు ప్రస్తుతం మూడునాలుగు రోజులకే పాడైపోతున్నాయని బెంగళూరుకు చెందిన మురళి, పిఠాపురానికి చెందిన వెంకట్ శుక్రవారం తిరుమలలో జరిగిన డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం ద్వారా ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. లడ్డూలు నాణ్యత లేదని, చక్కెర అధికంగా ఉండటంతో పాటు సువాసన తగ్గిపోయిందని ఫిర్యాదు చేశారు. ఈవో స్పందిస్తూ లడ్డూల విషయంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఎప్పటి నుంచో ఉన్న శ్రీవైష్ణవ బ్రాహ్మణులే వాటిని తయారు చేస్తున్నారని, నిత్యం వారికి పలు సూచనలు ఇస్తున్నామని అన్నారు. ఇకపై లడ్డూల నాణ్యత విషయంలో మరింత శ్రద్ధ వహిస్తామన్నారు. తిరుమలలో పావురాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ కారణంగా శ్వాస సమస్యలు ఎదురయ్యే అవకాశముందని అనురాధ (నాయుడుపేట) ఈవో దృష్టికి తీసుకురాగా సమస్యపై పరిశీలన చేస్తామని బదులిచ్చారు. కాటేజీల్లో గీజర్లు ఉన్నా పనిచేయడం లేదని జగన్(హైదరాబాద్), మునిలక్ష్మి (నెల్లూరు). గిరన్న (ఆదోని) ఫిర్యాదు చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని ఈవో బదులిచ్చారు. తిరుమల టీదుకాణాల్లో మట్టి గ్లాసులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని పురుషోత్తం(గుంటూరు) సూచించగా యజమానులతో మాట్లాడి అవగాహన కల్పిస్తామన్నారు.

బతికేవున్నాం బాబూ..!

- లైఫ్ సర్టిఫికెట్ల కోసం విశ్రాంత ఉద్యోగుల పాట్లు
- వేలిముద్రలు పడక కార్యాలయాల వద్ద పడిగాపులు



లైఫ్ సర్టిఫికెట్ల కోసం వేలిముద్రలు వేస్తున్న పెన్షనర్లు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 5: విశ్రాంత ఉద్యోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. మారిన లైఫ్ సర్టిఫికెట్ మార్గదర్శకాలతో అవస్థలు పడుతున్నారు. కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఏటా తాము బతికేవున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి. ఆ ప్రకారం జిల్లాలోని 12,505 మంది పెన్షనర్లు ఏటా లైఫ్ సర్టిఫికెట్లు అందిస్తున్నారు. ఈ ఏడాదికి సంబంధించి జనవరి 1 నుంచి ఫిబ్రవరి నెలాఖరులోగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. గతంలో సర్టిఫికెట్లతో గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయిస్తే సరిపోయేది. ఇప్పుడు దానిని ఆన్‌లైన్ ప్రక్రియగా మార్చారు. జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా వేలిముద్ర వేస్తే సంబంధిత వివరాలు ఖజానాశాఖకు చేరుతాయి. ఇదో సులభతర మార్గంగా ప్రభుత్వం చెబుతుంది. కానీ వేలిముద్రలు సక్రమంగా పడక పండుటాకులు పడుతున్న అవస్థలు అంతాఇంతా కావు. పెన్షనర్లలో ఎక్కువ మంది 70 సంవత్సరాలు దాటిన వారే. వారి వేలిముద్రలు సక్రమంగా పడడంలేదు. రోజంతా కార్యాలయాల వద్ద ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. వేలిముద్రలు పడనివారు నేరుగా సబ్‌ట్రెజరీ కార్యాలయానికి వెళ్లి డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అందుకని విశ్రాంత ఉద్యోగులకు సులభంగా ఉన్న పాత విధానాన్నే పునరుద్ధరించాలని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.కేశవులు కోరారు.

నేరుగా లైఫ్ సర్టిఫికెట్ ఇచ్చినా సరి

వేలిముద్రలు పడని వారు నేరుగా లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చినా సరిపోతుంది. వేలిముద్రలు పడడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ముఖ యాప్ ద్వారా సేకరించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చేందులో ఏవైనా ఇబ్బందులుంటే 99516 02382 నెంబరుకు ఫోను చేయండి. ఇంకా కొంతమంది ఈకేవైసీ కూడా చేసుకోలేదు. అటువంటి వాళ్లు త్వరలో చేసుకోకుంటే పెన్షన్ ఆగే పరిస్థితి ఉంది. చిత్తూరుకు రాలేనివారు సమీప ఎస్టీవో కార్యాలయాల్లోనూ చేసుకోవచ్చు. పోస్టాఫీసుల్లోనూ లైఫ్ సర్టిఫికెట్లు చేసుకునే సౌలభ్యం ప్రభుత్వం కల్పించింది. పోస్టుమాస్టర్‌ను కలిస్తే ఇంటికే వచ్చి చేస్తారు.చంద్రశేఖర్, సబ్ ట్రెజరీ ఆఫీసర్, చిత్తూరు.

గంగమ్మ గుడిలో గోల్‌మాల్

వేళ్లన్నీ పాలకమండలి వైపే

- జమాఖర్చులకు వీరి ఆమోదం తప్పనిసరి
- అప్పుడు మౌనంగా ఉండడం వల్లే ఇప్పుడు భారీ మూల్యం
- దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ది కూడా ఇదే దారి
- బాధ్యత ఉండక్కర్లేదా అంటూ భక్తుల మండిపాటు

తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై వేళ్లన్నీ ఆలయ ధర్మకర్తలమండలి వైపే చూపిస్తున్నాయి. అమ్మవారికి భక్తులు సమర్పించే కానుకలు, విరాళాలకు జవాబుదారీతనంగా వ్యవహరించాల్సిన పాలకమండలి చైర్మన్, సభ్యులు ఉత్సవ విగ్రహాల్లా మారారన్న చర్చ జరుగుతోంది.అధికారిక లెక్కల్లోనే రూ.52 లక్షలు మాయమైనప్పటికీ పాలకమండలి మౌనంగా ఉండడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. దేవదాయ శాఖ చట్టం ప్రకారం ధర్మకర్తల మండలికి కీలకమైన అధికారాలుంటాయి. సభ్యుల సమన్వయంతో చైర్మన్ ప్రధాన భూమిక పోషిస్తుంటారు. ప్రతి నెలా జరిగే పాలకమండలి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలనే కార్యనిర్వహణాధికారి అమలుచేయాల్సి ఉంటుంది. నెలలో దేనికోసం ఎంతెంత ఖర్చుపెట్టారో జమాఖర్చుల వివరాలను తెలియపరిచి సభ్యుల ఆమోదం తీసుకోవాలి. అవసరానికి మించి ఖర్చు పెట్టివుంటే సమీక్షించి చర్యలు తీసుకునే అధికారం కూడా పాలకమండలికి ఉంది. అయితే గంగమ్మ ఆలయ పాలకమండలి మాత్రం ఇవేమీ పట్టనట్టుగా అమ్మవారిని దర్శనం చేసుకోవడం, తెలిసినవారికి దర్శనం చేయించి పసుపు,కుంకుమలను అందజేయడం వరకే పరిమితమైందన్న ఆరోపణలున్నాయి. ఆలయ సిబ్బందికి జీతాలు సక్రమంగా వస్తున్నాయా? లేదా? కూడా వీరికి తెలియదు. అదేవిధంగా ఆలయంలో ఒక కాంట్రాక్ట్ ఉద్యోగికి మాత్రమే భారీగా జీతం పెంచిన విషయం ధర్మకర్తల మండలికి తెలియకపోవడం పలు విమర్శలకు దారితీసింది. అంతెందుకు తుడా కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న ఆలయ ఆర్చి గురించి కూడా వీరి దగ్గర ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది. ఈ పరిణామాలపై ఇప్పటికే పాలకమండలిలో పలువురు అసంతృప్తిగా ఉన్నారు.తమ హయాంలో గంగమ్మ ఆలయంలో గోల్‌మాల్ జరిగిందన్న అపవాదు మూటగట్టుకోవాల్సి వస్తోందని మధనపడుతున్నారు. చేసిందెవరో, చేయించిందెవరో....అన్నీ గంగమ్మకు తెలుసంటూ వైరాగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు.

● వీరిపైన చర్యలేవీ?

గంగమ్మ ఆలయంలో గత మార్చి ఆర్థిక సంవత్సరానికి జరిపిన ఆడిట్‌లో రూ.17 లక్షలు తేడా కనిపించింది. జాతరకు నెలముందే ఇంత తేడా వచ్చినప్పుడు దేవదాయశాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్, సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్, ఆర్జేసీ ఏమీ మాట్లాడకుండా మౌనం దాల్చడం పలు అనుమానాలకు తావిస్తోంది. వీరిలో పలువురిని 'సంతృప్తి' పరచడంతో పాటు అధికార పార్టీ పెద్దల తరఫున వత్తిడి తీసుకురావడం, జాతర తర్వాత లెక్కలు చూసుకుంటామని చెప్పడం వలనే చూసీ చూడనట్టుగా ఉన్నారన్న విమర్శలున్నాయి.ముఖ్యంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పూర్తిగా విఫలమయ్యారని చెబుతున్నారు. మరి వీరిపై చర్యలు లేకుండా 'అంతా చేసింది' అతనే అంటూ చనిపోయిన ఇన్‌చార్జి ఈవో మునికృష్ణయ్యపై నెట్టేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.ఇంట్లో పెద్దదిక్కు పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఈవో కుటుంబంపైనే భారం మొత్తం వేస్తామనడం భావ్యం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఆర్జేసీ (ప్రాంతీయ సంయుక్త కమిషనర్) సత్యనారాయణ మూర్తి మీడియానుద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. 'గంగమ్మ గుడిలో గోల్‌మాల్ పై ఈవో బతికివున్నప్పుడు ఎందుకు వార్తలు రాయలేదని, అప్పుడు అవినీతి కనిపించలేదా అంటూ మీడియాను ఆయన ప్రశ్నించారు.జరిగిన తప్పులను పర్యవేక్షించేందుకు పటిష్ఠమైన యంత్రాంగం ఉండి కూడా బాధ్యులపై చర్యలు తీసుకోకుండా, ఆలస్యంగానైనా బయటపెట్టిన మీడియాపై అక్కసు వెల్లగక్కడం ఏమిటనడంతో తాను కొత్తగా వచ్చానని, ఇక్కడ ఏం జరుగుతుందో పూర్తిగా తెలియదని చెప్పుకొచ్చారు.

వచ్చేది మన రామరాజ్యమే

- 95 ఏళ్ల వృద్ధుడి ఉత్సాహం



గంగవరం, జనవరి 5: 'నాయనా అమరా.. వచ్చేది మన రామరాజ్యమే' అంటూ నడవలేని స్థితిలో ఉన్న 95 ఏళ్ల వృద్ధుడు చిడతలతో ఉత్సాహంగా పాట పాడారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలమనేరు మండలం జరావారిపల్లెలో మాజీమంత్రి అమరనాథరెడ్డి పర్యటించారు. వీధిలో ఓ మూలన కూర్చొని కళ్లు కూడా సరిగా కనిపించలేని స్థితిలో ఉన్న 95 ఏళ్ల బంగారప్ప టీడీపీ నేతలను చూసి లేచి నిలబడ్డారు. అమరనాథరెడ్డిని పట్టుకుని వచ్చేది మన రామరాజ్యమే.. చంద్రబాబుతోనే రామరాజ్య స్థాపన అంటూ చేతిలో చిడతలు పట్టుకొని పాడుతూ అందరినీ ఆశ్చర్యానికి గురుచేశారు.

ఇలాగైతే మాకొద్దు!

- ఎండీయూ వాహనాన్ని వెనక్కి పంపిన ప్రజలు



రేషన్‌బియ్యం సక్రమంగా ఇవ్వాలంటున్న గ్రామస్తులు

పుంగనూరు, జనవరి 5: కార్డుదారులందరికీ రేషన్‌బియ్యం ఇచ్చేట్లయితే సరి. లేదంటే మాకొద్దంటూ సదుం మండలం పాలమంద పంచాయతీ చెరువుముందరపల్లె గ్రామస్తులు ఎండీయూ వాహనాన్ని వెనక్కి పంపించారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. శుక్రవారం సాయంత్రం చెరువుముందరపల్లెకు ఎండీయూ వాహనం వచ్చింది. రేషన్‌కార్డుదారులంతా బియ్యం కోసం వచ్చారు. ఈనెల బియ్యం స్టాక్ తక్కువగా ఉందని, కొంతమందికే పంపిణీ చేస్తామని ఆపరేటర్ చెప్పారు. దీనిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఎవరూ బియ్యం తీసుకోకుండా బండిని వెనక్కిపంపారు. డిసెంబరులోనూ బియ్యం తక్కువ వచ్చిందని చాలా మందికి ఇవ్వలేదని గుర్తుచేశారు. మళ్లీ అదే సాకు చెప్పి తమకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గతనెల కొంతమందికే బియ్యం ఇచ్చారని, కందిబేడలు, చక్కెర తదితర నిత్యావసర వస్తువులు ఏమీ పంపిణీ చేయలేదన్నారు. అధికారులు చర్యలు తీసుకుని బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని వారు కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం : యువతి అరెస్టు

పూతలపట్టు, జనవరి 5: ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తున్న ఓ యువతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూతలపట్టు మండలం ఎం.బండపల్లికి చెందిన ఓ యువతి ప్రభుత్వ మద్యం షాపులో ఎమ్మార్పీకి కొనుగోలు చేసి, రాత్రిపూట అధిక ధరలకు విక్రయిస్తోంది. స్థానికుల ఫిర్యాదుతో ఎస్ఐ రామ్‌భూపాల్ తమ సిబ్బందితో ఆ యువతి ఇంట్లో తనిఖీలు నిర్వహించి, 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ యువతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెక్ పోస్టులలో పటిష్ట బందోబస్తు



చెక్ పోస్టులో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ కేశప్ప

పెద్దతిప్పసముద్రం జనవరి 5 : ఏపీలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్ పోస్టులలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు మదనపల్లె డీఎస్పీ కేశప్ప స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న పలు చెక్ పోస్టులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కృష్ణారావ్ ఆదేశాల మేరకు రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్ పోస్టులలో భారీగా బందోబస్తును ఏర్పాటు చేసి కర్ణాటక నుంచి మద్యం రాష్ట్రానికి తరలి రాకుండా కట్టుదిట్టం చేస్తామన్నారు. డీఎస్పీ వెంట సీఐ మధు, ఎస్ఐ రవీంద్రబాబు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, జనవరి 5: తాను నివాసం ఉన్న ఇంటిని భర్త, అత్త, మామా బలవంతంగా లాక్కొన్నారని ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. కురబలకోట మండలం చింతమాకులపల్లె పంచాయతీ నందిరెడ్డిగారిపల్లెకు చెందిన ఖాదర్‌వలికి తొమ్మిదేళ్ల కిందట నసీబ్‌జాన్‌తో వివాహమైంది. వారికి ముగ్గురు ఆడ బిడ్డలు వున్నారు. ఈ క్రమంలో ఖాదర్‌వలి అప్పులు చేసి, వాటిని తీర్చడానికి ఉన్న ఇంటిని తనఖా పెట్టాడు. దీంతో నసీబ్‌జాన్ కూలి పనులు చేసుకుంటే ముగ్గురు బిడ్డలను పోషించుకుంటూ, డబ్బు కూడబెట్టి తనఖా పెట్టిన ఇంటిని విడిపించుకుంది. ఈ క్రమంలో ఖాదర్‌వలి, అతని అమ్మ, నాన్న కలసి నసీబ్‌జాన్‌ను ఇంటిని తమకే ఇవ్వాలని గొడవ పడ్డారు. దీంతో మనస్థాపం చెందిన నసీబ్‌జాన్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు ఆమెను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

మద్యం స్వాధీనం - ఇద్దరి అరెస్టు

పెద్దమండ్యం, జనవరి 5: పెద్దమండ్యం మండలం బండ్రేవు గ్రామ పంచాయతీ కొత్తపల్లికు చెందిన రమణయ్య, నాగభూషణంల నుంచి మద్యం స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయుడు తెలిపారు. 180 ఎంఎల్ స్థాయి కలిగిన 60 మద్యం బాటిళ్లను వారు తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దిగువపల్లి పాపాఘ్ని నదిలో ఇసుకను తరలిస్తుండగా ఒక ట్రాక్టర్‌ను, ఒక ఇటాచీ యంత్రాన్ని స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కంటైనర్ బోల్తా

కురబలకోట, జనవరి 5:మదనపల్లె పట్టణ శివార్లలో అమ్మచెరువు మిట్ట మలుపు వద్ద కంటైనర్ బోల్తా పడింది. గురువారం రాత్రి చెన్నై నుంచి హైదరాబాద్ వెళుతున్న లారీ మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించ లేదు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8మంది జూదరుల అరెస్టు

కలకడ, జనవరి 5:మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ నాయినవారిపల్లెకు సమీపంలో జూదం ఆడుతున్న 8 మంది అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వారి నుంచి రూ.38830 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడులో సిబ్బంది హరిబాబు, రమేష్, తాతయ్య, యూనస్, నాగిరెడ్డిలు పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర పథకాలు

గుర్రంకొండ, జనవరి 5:అర్హులైన పేదలందరికీ కేంద్ర పథకాలు అందించాలని బీజేపీ నాయకులు అన్నారు. మండలంలోని సరిమడుగులో శుక్రవారం వికసిత్‌భారత్ సంకల్పయాత్ర నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మమ్మ, నాయకులు మేకల చలపతి, శ్రీకాంత్, రమణలు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి ఇక 100 రోజులే..

● అంగన్వాడీల సమ్మెలో టీడీపీ నేతల ధ్వజం ●మదనపల్లెలో నల్లబెలూన్లతో, వాల్మీకిపురంలో మోకాళ్లపై నిల్చొని నిరసనలు



మదనపల్లెలో మోకాళ్లపై కూర్చొని అంగన్వాడీల నిరసనకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నాయకులు



బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

మదనపల్లె టౌన్, జనవరి 5: అరాచకాలతో మిడిసి పడుతున్న జగన్ ప్రభుత్వానికి 100 రోజులే గడువు ఉందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 25వ రోజు సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఆర్‌జే వెంకటేశ్ మాట్లాడుతూ పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి అంగన్వాడీలను అణచివేసే ధోరణిలో జగన్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆరోపించారు. టీడీపీ, జనసేన పొత్తుతో అధికారం చేపట్టగానే అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. తెలుగు రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు మాట్లాడుతూ గతంలో అంగన్వాడీలకు వేతనాలు పెంచి చంద్రబాబు ఆదుకున్నారని, ఇప్పుడు జగన్ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా సైకోలా ప్రవర్తిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్వర్‌బాషా, గండికోట గణేష్‌బాబు, లక్ష్మన్న, విద్యాసాగర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నల్ల బెలూన్లతో అంగన్వాడీల నిరసనలు

మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట 25వ రోజు సమ్మెలో భాగంగా అంగన్వాడీలు నల్ల బెలూన్లతో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాళ్లు మధురవాణి, గంగాదేవి మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సెక్టార్ల లీడర్లు అనసూయ, గీతీ, భాగ్యమ్మ, అఖీరున్నీసా, రాజమ్మ, సుందరి, కుసుమ, అరుణ, వనజ పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: కనీస వేతనాలు, డిమాండ్ల సాధన కోసం గడచిన 25రోజులుగా సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలలో భాగంగా దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు మోకాళ్లపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. గౌరవ వేతనం ఇచ్చి తీరాల్సిందేనని నినదించారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకై లేశ్వరి, అమ్మాజీ, ప్రసన్న, లక్ష్మీనరసమ్మ, దేవసేన, రెడ్డిరాణి, వాల్మీకిపు రం, కలికిరి, గుర్రంకొండ మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 25వ రోజు కొనసాగింది. శుక్రవారం ఉదయం తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు, హెల్పర్లు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఎర్ర చీరలతో మానవహారంగా ఏర్పడి తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: తమ డిమాండ్ల పరిష్కారం కోసం బి.కొత్తకోట అంగన్వాడీ కార్యకర్తలు, చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దీక్షా శిబిరంలో కబడ్డీ ఆడుతూ, తమ నిరసనను వ్యక్తం చేశారు. ములకలచెరువు మండల అంగన్వాడీ నాయకురాలు చాంద్‌బీ అంగన్వాడీలకు జరుగుతున్న అన్యాయాన్ని తమ సహచరులకు గద్దె రూపంలో చెబుతూ నిరసన తెలిపారు. ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెలో భాగంగా వంటా-వార్పులో జనసేన నేత రామ్‌దాస్‌చౌదరి





మదనపల్లెలో మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు పలుకుతున్న కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు

మదనపల్లె, జనవరి 5: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని సంఘనేతలతోపాటు కార్మికులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. ఇందులోభాగంగా విధులు బహిష్కరించిన కాంట్రాక్టు, దినసరి కార్మికులు..స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. న్యాయ పరమైన డిమాండ్ల పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదన్నారు. ఇందులో భాగంగా వివిధ రూపాల్లో నిరసన చేపట్టిన వారు ప్రజాప్ర తినిధులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేష్‌కుమార్, ఎస్.మ స్తాన్, నాగరాజ, దేవా, ఇంద్రాణి, తిరుమలప్ప, గోపాలు, పృధ్వీరాజ్, ఎస్.ముబారక్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జనసేన మద్దతు

స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు జనసేన కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా వంటా-వార్పు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామ్‌దాస్‌చౌదరి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి..మూడునెలల్లో ఏర్పడ నున్న జనసే-టీడీపీ సంకీర్ణ ప్రభుత్వంలో పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల గౌతమ్, అడపా సురేంద్ర, జగదీష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు కాంగ్రెస్, బీఎస్పీ మద్దతు

మదనపల్లె అర్బన్, జనవరి 5: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులకు శుక్రవారం బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, నియోజకవర్గ నాయకుడు ఎస్ రెడ్డిసాహెబ్‌లు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేకపాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే వారితో కలిసి ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేంద్రరెడ్డి, డాక్టర్ ఎస్‌కేబాషా, మహబూబుపీర్, అలీ, సమీర్, నాని, నాగరాజ, ఈశ్వరమ్మ, పాలేటి, బీఎస్పీ నాయకులు రమణ, బాలాజీ, శ్రీను, అరుణ్, శివ, రఘు, ప్రశాంత్, లక్ష్మీపతి,మహేష్, రెడ్డెప్ప, గంగాధర్ పాల్గొన్నారు.



17మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు

మదనపల్లె అర్బన్, జనవరి 5: మదనపల్లె లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 17మందికి ఉచిత క్యాటరాక్ట్ సర్జరీలు నిర్వహించినట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అప్పినిపల్లె భాస్కరాచారి తెలిపారు. శుక్రవారం స్థానిక లయన్స్ కంటి ఆస్పత్రిలో 17మందికి కంటి సర్జరీలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంజేఎఫ్ పీఆర్వో లయన్ గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డు ఎంఈవోకు ఘన సన్మానం

పీలేరు, జనవరి 5: ఇటీవల పెనుమూరు ఎంఈవోగా పదవీ విరమణ చేసిన రంగనాథరెడ్డిని శుక్రవారం పీలేరులో ఘనసన్మానించారు. పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా, ఇన్‌ఛార్జ్ ఎంఈవోగా సైతం పనిచేసిన ఆయనను శుక్రవారం ఉన్నత పాఠశాలలో పలు మండలాలకు చెందిన ఎంఈవోలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం నటరాజన్ అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంఈవోలు లోకేశ్వరరెడ్డి, రెడ్డిబాషా, ఉపాధ్యాయ సంఘ నేతలు రాధాకృష్ణ, పోతంశెట్టి రమేశ్, చంద్రశే ఖర్, జగన్మోహన్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముదివేడు ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి

కురబలకోట, జనవరి 5: మండలంలోని ముదివేడు ఎస్ఐగా మల్లికార్జునరెడ్డిని నియమిస్తూ జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు. కాగా ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ ముబీన్‌తాజ్‌ను రాయచోటి అర్బన్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని పూజలు

ములకలచెరువు, జనవరి 5: రాష్ట్రం సైకో పాలన నుంచి విముక్తి కలిగి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మళ్లీ సీఎం కావాలని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆ మేరకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత గురజాల జగన్‌మోహన్, పెద్దమండ్యం మండలాధ్యక్షుడు జి.వెంకటరమణ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ

బి.కొత్తకోట జనవరి 5 : బి.కొత్తకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ పెన్షన్లను ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జడ్పీటీసీ రామచంద్ర, నగర పంచాయతీ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ రఫిక్‌అహ్మద్, ఎంపీడీవో శంకరయ్య, ఖలీల్ అహ్మద్, ప్రదీప్ రెడ్డి, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: పీటీఎంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గల క్రీడా మైదానంలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మహమూద్, జడ్పీటీసీ శివన్నతో పాటు అధికారులు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారుల ఎంపిక

పీలేరు, జనవరి 5: పీలేరు ఏపీఐఐసీ 4వ లే-ఔట్ లబ్ధిదారుల ఎంపిక శనివారం తమ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దారు ధనంజయులు ఒక ప్రకటనలో తెలిపారు. గత డిసెంబరు 23న జరిగిన లక్కీ డిప్ కార్యక్రమానికి గైర్హాజరైన లబ్ధిదారులు శనివారం ఉదయం 11 గంటలకు తమ కార్యాలయంలో జరిగే లక్కీ డిప్ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన తెలిపారు. తమ వెంట ఆధార్ కార్డు జిరాక్సు, ఒక ఫొటో తెచ్చుకోవాలన్నారు.



విస్తృతంగా శ్రీరామ అక్షింతల పంపిణీ

కలికిరి, జనవరి 5: అయోధ్య రామాలయంలో ఈ నెల 22న రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా 15వ తేదీ వరకూ శ్రీరామ పూజిత అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో రామసేవకులు విస్తృతంగా చేపట్టారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఇంటింటికీ శ్రీరామ పూజిత అక్షింతలను చేర్చే విధంగా ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా అక్షింతల స్వీకరణపై తీర్థ క్షేత్ర భక్తులకు కొన్ని సూచనలు జారీ చేసింది. అక్షింతలను జనవరి 22 వరకూ పూజా మందిరంలో ఉంచి ప్రతి రోజూ జయరామ తారక మంత్రోచ్చారణతో పూజించాలని తీర్థ ట్రస్టు వివరించింది. కార్యక్రమంలో గణేష్, భువనేష్, బాలాజీ, మహేష్, జగదీష్, కిరణ్‌కుమార్ తదతర రామసేవకులు పాల్గొన్నారు.

ఇంటింటికి జనసేన కార్యక్రమం

మదనపల్లె, జనవరి 5: పట్టణంలోని మేదరవీధిలో ఇంటింటికీ జనసేన కార్యక్రమాన్ని జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి నిర్వహించారు. ఇందులో భాగంగా జనసేన మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటా అందజేశారు. ఘన చరిత్ర గల మదనపల్లెను జిల్లా కేంద్రం చేయకుండా అన్యాయం చేసిన వైసీపీకి, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలకు వచ్చే సాధారణ ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం బీఎస్పీ పార్టీ కార్యాలయానికి వెళ్లిన రామ్‌దాస్‌చౌదరి పార్టీ నాయకుడు బందెల గౌతమ్‌ను..వచ్చే సాధారణ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ అధిష్ఠానంతో చర్చించి తన నిర్ణయం చెబుతానని పేర్కొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

కలకడ, జనవరి 5:అండర్-17 జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు కోన హైస్కూల్ టెన్త్ విద్యార్థిని షబీనా ఎంపికైనట్లు హెచ్‌ఎం చెంగల్‌రాయులు తెలిపారు. విద్యార్థిని రాష్ట్ర స్థాయి తెనాలిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచనట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి మధ్యప్రదేశ్‌లోని సుజల్‌పూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

కేంద్రం తెచ్చిన రవాణా బిల్లును వెనక్కి తీసుకోవాలి



లారీ డ్రైవర్లు, క్లీనర్లతో కలసి నిరసన తెలుపుతున్న జింకా వెంకటాచలపతి

మదనపల్లె, జనవరి 5: రవాణా రంగంలో కేంద్రం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ బిల్లుపై నిర్ణయాన్ని పునరాలోచించి వెనక్కి తీసుకోవాలని మదనపల్లె లారీ, ఐచర్స్ డ్రైవర్లు, క్లీన ర్ల అసోసియేషన్ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి డిమాండ్ చేశారు. మదనపల్లె పట్టణం పుంగనూరురోడ్డులోని లారీవర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం లారీ, ఐచర్ డ్రైవర్లు, క్లీనర్లతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన బిల్లు రవాణా రంగంలో తీవ్ర కలకలం రేపుతోందన్నారు. ట్రక్కు లేదా లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఏదైనా జరిగితే రూ.7లక్షలు జరిమానా, పదేళ్ల జైలు నిబంధనలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సివస్తోందన్నారు. ఇలాంటి బిల్లుతో సామాన్యుడికి అసామాన్యమైన శిక్ష పడే అవకాశమే కాదు..ఆ కుటుం బం చిన్నాభిన్నం అయ్యే పరిస్థితి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కేంద్రం పునఃపరిశీలన చేయాలని వెంకటాచలపతి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆసంఘం ఉపాధ్యక్షుడు కె.చంద్ర, ఎస్.రియాజ్, ఎస్ఎంషఫీ, కార్యదర్శి ముక్బుల్, ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జున, ఎస్.ఫరీద్, వర్కింగ్ ప్రసిడెంట్ మహమ్మద్ ఖాజా, చలపతి, కె.నాని, కోశాధికారి పి.అహమ్మద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఇంటర్వ్యూలకు 58 మంది హాజరు



సబ్‌కలెక్టరేట్‌లో అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో

మదనపల్లె టౌన్, జనవరి 5: మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా వున్న అంగన్వాడీ పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 58 మంది హాజరయ్యారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఆర్డీవో మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 10 అంగన్వాడీ కార్యకర్తలు, 23 అంగన్వాడీ హెల్పర్లు, ఇద్దరు మినీ అంగన్వాడీ వర్కర్ పోస్టులకు అభ్యర్థులను ఇంటర్వ్యూ నిర్వహించారు. అంగన్వాడీ సెంటర్లలో లబ్ధిదారులకు అందుతున్న సేవలు, సంక్షేమపథకాలు, తదితర అంశాలపై ఆర్డీవో మురళి, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ శశికళ ప్రశ్నలు అడిగారు. ఈ కార్యక్రమంలో ఇంటర్వ్యూ కమిటీ సభ్యులు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మి, మదనపల్లె, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, వాల్మీకిపురం ప్రాజెక్టుల సీడీపీవోలు సుజాత, భాగ్యమ్మ, నాగవేణి, భారతి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు

మదనపల్లె అర్బన్, జనవరి 5: ఆర్టీసీలో ఉత్తమ ప్రతిభను కనపర్చిన ఆదర్శ ఉద్యోగులకు శుక్రవారం ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వారిని అభినందించి, ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను వన్ డిపో కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈసందర్భంగా డీఎం మూరేవెంకటరమణారెడ్డి మాట్లాడుతూ డిసెంబరు నెలల్లో ఈపీకే 37 సాధించి మొదటి స్థానంలో 5.35 కేఎంపీఎల్ సాధించి రీజియన్‌లోనే రెండవస్థానంలో నిలిపిన ఆర్టీసీ ఉద్యోగులను అభినందించారు. జనవరి 1న న్యూఇయర్ సందర్భంగా హార్సిలీహిల్స్‌కు, తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ప్రత్యేక సర్వీసు నడిపి ఆర్టీసీకి అధిక ఆదాయం తెచ్చిన ఉద్యోగులను ఈడీ, అభినందించారని తెలిపారు. ఇందులో గ్యారేజ్‌నందు ఉత్తమ లీడింగ్ హ్యాండ్‌గా ఎం.నాగరాజ, ఉత్తమ డ్రైవర్‌గా కేఎంపీఎల్ 6.25 సాధించిన ఎంఆర్‌కృష్ణ, 6.06 సాధించిన ఎస్‌జడ్‌బాబు, ఉత్తమ మెకానిక్ ఎస్ఆర్‌బాబా, ఉత్తమ కోచ్‌బిల్డర్ ఎం.జగదీష్, ట్రాఫిక్‌లో ఉత్తమ ఏడీసీ వీఎస్‌వాసులు, డ్రైవర్ ఎం.నాగరాజ, ఉత్తమ కండెక్టర్లు ఎం.నాగరాజ కే.శ్రీనివాసులు, అరుణకుమారి అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. ఈ సభలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాడి రైతులకు సబ్సిడీ ధరలతో గడ్డి విత్తనాలు



గుట్టపాలెంలో గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ, సర్పంచు

కలికిరి, జనవరి 5: సబ్సిడీ ధరలతో రైతులకు పంపిణీ చేసేందుకు గడ్డి విత్తనాలు సిద్ధం చేశామని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు కె.వెంకటమునినాయుడు తెలిపారు. అన్ని ఆర్బీకే కేంద్రాల్లో 75 శాతం సబ్సిడీతో విత్తనాలను నిల్వ చేశామని, పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం మండలంలోని గుట్టపాళెం పంచాయతీలో గడ్డి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఏడీ మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకూ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతోందని చెప్పారు. అదే విధంగా మార్చి నెలాఖరు వరకూ గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలను కూడా వేయనున్నట్లు ఏడీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులకు సర్పంచు వెంకట రెడ్డి గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకుడు రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

'ఎస్సీల స్థలంలో చిట్లాకుప్పను వేయనీయం'

మదనపల్లె అర్బన్, జనవరి 5: ఎస్సీలకు కేటాయించిన ఇళ్లస్థలంలో చిట్లాకుప్పను వేయనీయమని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు బాధితులతో కలిసి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని సీటీఎం పంచాయతీ, చిలుకవారిపల్లె రెవెన్యూగ్రామ సర్వే నెంబరు 656,657-1లోని 9.19 సెంట్లును 1993లో మదనపల్లె తహసీల్దార్ బీసీలకు, ఎస్సీలకు ఇళ్లస్థలాలు కేటాయించి ఇంటిపట్టాలను మంజూరు చేశారన్నారు. బీసీలకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని, ఎస్సీలు ఆర్థిక స్తోమత లేక ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదన్నారు. ఇప్పటికీ ఎస్సీలకు కేటాయించిన స్థలం ఖాళీగా ఉందని ఎస్సీలపై దౌర్జన్యం చేస్తూ అక్కడ సంక్రాంతి పండుగకు పశువులు కోసం చిట్లాకుప్ప ఏర్పాటు చేసి తద్వారా ఆ ఖాళీ స్థలాన్ని ఆక్రమించాలని బీసీలు చూస్తున్నారని ఆరోపించారు. మాకు ఇంటిపట్టాలు ఉన్న స్థలం ఆక్రమించి, మాపై దాడికి దిగుతున్నారన్నారు. దీనిపై రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఎస్సీలకు కేటాయించిన స్థలంలో ఇళ్లు కట్టుకోవడానికి అనుమతివ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహు జనసేన కార్యదర్శి ఆనంద్, గ్రామస్థులు గంగులప్ప, చంద్రశేఖర్, వెంకటస్వామి, రామ్మూర్తి, పెద్దవెంకటరమణ, కదిరప్ప, భాస్కర్, కేశవులు, రామాంజులు, రామచంద్ర పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



రాష్ట్రఅధ్యక్షుడు సుబ్బరాయన్‌ను కలిసిన ఏపీసీనియర్ సిటిజన్ నేత మునిగోపాలకృష్ణ

మదనపల్లె అర్బన్, జనవరి 5: రిటైర్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మునిగోపాల కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆవిర్భావ సమావేశంలో ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్‌ను కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతినెల 1వ తేదీన పెన్షన్ జమచేయాలని, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, తాత్కాలిక భృతి ఇవ్వాలని, సీపీఎస్‌ను అమలు చేయాలని, ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన వారికి సెంట్రల్ మెయింటెనెన్స్ పెన్షన్ రూ. 7500 చెల్లించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు మణికంటే నారాయణ, ట్రెజరర్ తిమ్మయ్య, ఉపాధ్యక్షుడు గురునారాయణాచారి, రెడ్డెప్ప, జగన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

నిమ్మనపల్లి, జనవరి 5: నిమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్. భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. శుక్రవారం జరిగిన ఎస్టీయూ ఎన్నికల్లో మండలంలోని గుండ్లబురుజు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సి. జయరామిరెడ్డిని అధ్యక్షుడుగా, ఎర్రాతివారిపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు బి.మోహన్‌ను ప్రధానకార్యదర్శిగా ఎన్నుకొన్నారు. అదే విధంగా ఆర్థిక కార్యదర్శిగా గురుమూర్తి, గౌరవాధ్యక్షుడిగా ఇబ్రహీంను ఎన్నుకొన్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులురెడ్డి, జిల్లా కౌన్సిలర్లు శ్రీనివాసులు, రమణారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, మధుబాబు, మురళికృష్ణ, రఘునాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

పెద్దమండ్యం, జనవరి 5: పెద్దమండ్యం మండల ఎస్టీయూ అధ్యక్షుడుగా ఎం. వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మధుసూధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. పెద్దమండ్యంలో శుక్రవారం వారి ఆధ్వర్యంలో ఎస్టీయూ మండల కార్యవర్గ ఎంపిక జరిగింది. ఎస్టీయూ మండల అసోసియేట్ అధ్యక్షుడిగా రాజేంద్ర, ఉపాధ్యక్షుడిగా శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఖాదర్‌వలీ, ఫైనాన్స్ కార్యదర్శిగా చలపతి, మహిళా కన్వీనర్లుగా మాధవి, షబ్రీనుషా, జిల్లా కౌన్సిలర్లుగా సీవీ రమణ, కేవీ రమణ, హరిష్, నాగప్ప, ఇందిరమ్మలను ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి కృషి చేస్తామని ఎస్టీయూ మండల నూతన కార్యవర్గ నేతలు తెలిపారు.